# ఎందుకు లెండి!

"**ఈరోజునుండీ** సిగరెట్లు కాల్చడం మానేస్తున్నా" నన్నారు మావారు జనవరి ఒకటవ తేదీనాడు. నా ఆనందానికి అంతులేదు. ఎక్కువగా సిగరెట్లు కాల్చే భర్త, ఉన్నట్లుండి ఒక్కసారిగా సిగరెట్లు కాల్చడం మానేస్తానంటే ఏ భార్య అయినా సంతోషపడకుండా ఎలా ఉంటుంది! ఉండదు. అందుకే సంతోషపడ్డాను. వారి నిశ్చయాన్నీ, మనోనిగ్రహాన్నీ అభినందించాను. ముఖ్యంగా కొత్త సంవత్సరం ఆరంభంలోనే ఒక దురలవాటు మానేయడం శుభసూచకంగా తోచింది.

ఎందుకయినా మంచిదని నేను కనిపించిన వాళ్ళందరికీ "మావారు సిగరెట్ మానేశారు" అని చెప్పడం మొదలెట్టాను (మావారు వినేట్టుగా). ఆయన మళ్ళీ ఎక్కడ వెనక్కు తగ్గుతారోననే భయం నా మనసులో ఓమూల లేక పోలేదు. అందుకే వారిచేత కమిట్ చేయించేస్తే కనీసం అందరికీ తెలిసిపోయిందనే అభిమానంతోనైనా మళ్ళీ సిగరెట్ ముట్టుకోరనే దురాశతో బుర్ర ఉపయోగించాను కాస్త. మావారు సిగరెట్ మానేశారని నేను బయటివాళ్ళకు చెప్పినప్పుడంతా, మావారు కాస్త చిరాకు పడేవారు.

"ఎందుకూ అప్పుడే పబ్లిసిటీ? ఇంకా రెండు రోజులైనా కాలేదుగా మానేసి?" అంటూ విసుక్కునేవారు. వారలా అన్నప్పుడు నా గుండె గతుక్కుమనేది.

సిగరెట్ మానేసి మూడురోజులైంది. ఈ మూడురోజుల్లో సిగరెట్ కాల్చే టైముకు ఏ వక్కపొడి నోట్లో వేసుకోవడమో, లేక ఎన్నడూ అలవాటులేని తాంబూలం వేసుకోవడమో చేస్తూ నానా అవస్థ పడుతున్నవారిని చూస్తే కాస్త జాలేసింది. కాని, ఇది జాలి పడవలసిన విషయం కాదు. ఈ సమయం జారవిడిస్తే మళ్ళీ జన్మలో వారంతట వారు సిగరెట్ మానేసే అవకాశం కలగడం కష్టం.

ఈ రెండు మూడు రోజుల్లో సిగరెట్ కాల్చే వాళ్ళెవరన్నా కనిపిస్తే ప్రాణం లేచొచ్చేది మావారికి. వాళ్ళ ముక్కుల్లోంచీ, నోట్లోంచీ వదిలే పొగను ఆస్వాదిస్తూ వాళ్ళ దగ్గరికి వెళ్ళి మాట్లాడుతూ కాసేపు తమూ సిగరెట్ తాగుతున్న అనుభూతి పొందేవారు. మరుక్షణం మళ్ళీ నేమంతా చూసి ఎక్కడ పసిగట్టేస్తానో నని "అబ్బబ్బ! వాసన!" అంటూ నవ్వుతూ కర్చిఫ్‌తో ముక్కు మూసుకుని వాళ్ళ దగ్గరే నిలబడేవారు.

"పోనీ, మీ ఎదుట వాళ్ళను సిగరెట్ కాల్చవద్దని చెప్పండి. లేకపోతే మీరన్నా దూరంగా వెళ్ళి ఆ పొగను ఆఘ్రాణించడం మానేయండి" అని నేనంటే—

"అబ్బెబ్బే! ఛా ఛా! ఇందులో ఏముంది? మానేశాం, అంతే. ఈమాత్రానికే మన డెసిషన్ మారుతుందనుకున్నావా?" అంటూ దబాయించేవారు. ఎంత దబాయించినా సిగరెట్ తాగేవాళ్ళను దగ్గర్లో ఉండి చూస్తూ ఉండటంతో మావారికి కాస్త తృప్తి కలుగుతూందని గ్రహించాను. పోనీ, చూసినంతమాత్రాన ఏంపోయింది! మళ్ళీ సిగరెట్ కాల్చకుండా ఉండడమేగా కావాలసింది? అని నేను సరిపెట్టుకుందామని ప్రయత్నించినా ఆ ఎదుటివాళ్ళు వదిలే పొగ మనసును సుళ్ళుతిప్పి మళ్ళీ ఎక్కడ సిగరెట్ తాగడం మొదలెడతారోననే భయం ఓమూల ఉండనే ఉంది.

నాలుగురోజులైంది సిగరెట్లు మాని. ఒక్కొక్క రోజు ఒక్కొక్క యుగంలా గడుస్తోంది మావారికీ, నాకూ కూడా.

పసిపిల్లాడిచేత తల్లి పాలు మానిపించడం కూడా అంత కష్టంగాదేమో అంటుంది మా పక్కింటావిడ.

మావారిలో ఎన్నడూ కనని మార్పు సిగరెట్ మానేసిన తర్వాత కనిపించింది. ఎప్పుడూ శాంతంగా ఉండేవారూ, నిదానంగా మాట్లాడేవారూ చీటికీ మాటికీ చిరాకుపడడం, ప్రతి చిన్న విషయానికీ కోపం తెచ్చుకుని గట్టిగా కేకలెయ్యడం—కోపానికి అధిదేవతనైన నాకే ఆశ్చర్యం కలిగించింది. దీనికంతా కారణం సిగరెట్టేనని తెలిసినా, తెలిసినట్టు ఉండకూడదుగా?

"ఎందుకలా ఉన్నారు? ఆరోగ్యం బాగా లేదా?" అంటూ తెలివితేటలు ఉపయోగించి అడిగాను.

"ఆరోగ్యానికేం రోగం! నీ లెక్కప్రకారం సిగరెట్ మానేస్తే ఆరోగ్యం బాగుండాలిగా? బాగానే ఉంటుంది!" అంటూ మరి కాస్త కస్సుమన్నారు. కిమన్నాస్తి.

సిగరెట్ మానేసి అయిదురోజులైంది. వారి స్నేహితులు చాలామంది "ఏం బ్రదర్, సిగరెట్ మానేశావటగా! కంగ్రాచ్యులేషన్స్!" అంటూ మావారిని అభినందించారు అదేపనిగా ఇంటికొచ్చి.

మావారు కాస్త తెల్లబోతూ "మీకెలా తెలిసింది! నేనింకా ఎవరికీ చెప్పలేదే!" అన్నారు. నేను లోపలికి తప్పుకున్నాను. "అదే, బ్రదర్! మా ఆడవాళ్ళు చెప్తే విన్నాం. బహుశా మీ ఆవిడ చెప్పి ఉంటుంది వాళ్ళతో.

"అది సరేగానీ, బ్రదర్, ఎట్లా మానగలిగావ్, బ్రదర్! అసలు మా అందరికంటే ఎక్కువ కాల్చేవాడివే నువ్వు! నిజంగా నువ్వు మానేశావంటే ఆశ్చర్యంగా ఉంది. నీ నిగ్రహాన్ని అభినందించాల్సిందే. అయినా ఒక్కసారిగా మానేశావా! లేక రోజు కొకటీ రెండూ చొప్పున తగ్గించుకుంటూ వచ్చావా?" అంటూ తలకొక సిగరెట్ వెలిగించి ఆ పొగ మావారి ముఖంమీదే ఊదేస్తూ 'డీటేల్స్'లోకి దిగారు మిత్రబృందం.

మావారు ఏడవలేక నవ్వారు. "అదేంలేదు. జనవరి ఫస్టునుండీ మానెయ్యాలనుకున్నాను, మానేశాను" అన్నారు.

"అయితే నిజంగా మానేసినట్టేనా?"

"ఎలా ఉండగలవ్, బ్రదర్!"

"అరె! ఒక్కనిమిషం సిగరెట్ లేకపోతే పిచ్చెక్కినట్లుంటుందే!"

"పిచ్చి అట్లా ఉంచు. ముందు బుర్ర పని చెయ్యదే! ఏంచేద్దామన్నా తోచిచావదే!"

"అయితే నువ్వు ఈ అయిదారు రోజుల్లో మామూలుగా ఉన్నావా! లేక కొత్తగా ఓమాదిరిగా తోచకుండా ఉందా?" అంటూ ముక్కుల్లోంకి పోతున్న సిగరెట్ పొగకు మత్తెక్కి విశ్వామిత్రుడిలా తపస్సులో ఉన్న మావారిని, చుట్టూ చేరిన సిగరెట్ మేనకలు మేకల్లా ప్రశ్నలతో మెయ్యడం మొదలెట్టారు.

ఈ శ్రేయోభిలాషులందరూ సిగరెట్ మానేసిన మనిషి ఎదట కాసేపు సిగరెట్ కాల్చకుండా మాట్లాడి అవతల కెళ్ళరాదూ! మావారు, పాపం! సిగరెట్ల వాతావరణంలో గతాన్ని జ్ఞప్తికి తెచ్చుకుని, సిగరెట్ మానేసినందుకూ, మళ్ళీ మరిచిపోలేక పోతున్నందుకూ లోలోపల ఎంత బాధపడుతున్నారో నాకు తెలుసు.

"అసలు పూర్తిగా మానేశావా? లేక నీ ఆవిడకోసం పైకి దబాయిస్తున్నావా?" అన్నారు ఒకరు.

"ఛా ఛా!" అంటూ నీరసంగా నవ్వారు మావారు.

"మేమంతా సిగరెట్ కాలుస్తుంటే నీకూ కాల్చాలని లేదూ! లోపలుంటుందిలే. పైకి బుకాయిస్తున్నావ్!" అంటూ మావారి వీపు చరిచాడొక మహానుభావుడు.

వాళ్ళందర్నీ మింగెయ్యాలన్నంత కోపం వచ్చింది. ఓ మనిషి బాగుపడుతుంటే చూడలేదు వెధవ ప్రపంచం.

"మీరిలాంటి చిక్కుప్రశ్న లడక్కూడదోయ్! ఇదుగో, మీకోసం నేనూ ఓ సిగరెట్ కాలుస్తాను" అన్నారు మావారు. నా గుండె ఆగినంత పనయింది. తీరా చూస్తే ఓ పుల్ల సిగరెట్‌లా చేతులో ఉంచుకుని ఉత్తుత్తినే ఊదేస్తూ నావైపు చూసి నవ్వారు. వారి అవస్థకు నిజంగానే జాలేసింది.

"ఏం ఖర్మ, బ్రదర్! ఎక్కువ కాల్చకుండా లిమిటెడ్‌గా కాల్చు, ఫర్వాలేదు. ఆమె ఏం అనర్లే" అంటూ మావార్ని కాలుబట్టే లాగడం మొదలెట్టారు మిత్రబృందం.

నాకు నిజంగానే వాళ్ళందర్నీ అక్కణ్ణుంచి తరిమి వెయ్యాలనిపించింది. సిగరెట్ మానేసిన

భానుమతి రామకృష్ణ

మనిషి ఎదట సిగరెట్ తాగుతూ ఆ మనిషి మనసును క్షోభపెట్టేది చాలక ప్రశ్నలతో 'డిస్కరేజ్' చేయడం అన్యాయం అనిపించింది.

నా ఎక్స్‌ప్రెషన్ చూసిన మావారు "ఛాఛా! మానేశానన్నానుగా? అంతే" అన్నారు.

మిత్రబృందానికి పట్టుదల ఎక్కువైంది.

"ఎలా, బ్రదర్! మానెయ్యడం మాటంటను కున్నావా! పెళ్లాం లేకుండానన్నా ఉండగలం కాని సిగరెట్ లేకుండా ఉండడం కష్టం. ఉండలేం. ఉంటే మహా రెండురోజులు, మూడు రోజులు. మహా అయితే వారం పదిరోజులు. పోనీ, పదిహేనురోజులు ఎలాగో పళ్ళు బిగబట్టి ఉంటావ్! ఆ తర్వాత? సిగరెట్ మరిచిపోతావా! ఇమ్‌పాసిబిల్! మాకు నమ్మకంలేదు. మేమూ ట్రై చేశాంగదా, బ్రదర్? సిగరెట్ మానెయ్యడం అంటే మాటలుగాదు! ఎంత కష్టమో మాకు తెలుసు. అయినా వుయ్ విష్ యూ గుడ్‌లక్" అంటూ వెళ్లిపోయారు.

మావారు సందేహాస్పదంగా ఉన్న నా ముఖం లోకి చూశారు. "ఛాఛా! నువ్వేం ఖంగారుపడకు. వాళ్లంతా ఇంతకుముందు మానెయ్యాలని ప్రయత్నించి ఫెయిలయిన సన్యాసుల్లే. ఏదో వాగుతారు" అంటూ నన్ను సమాధానపరిచారు.

సిగరెట్ మానేసి వారంరోజులైంది. ఆ రోజు బలే హుషారుగా ఈల వేసుకుంటూ ఇంటికి వచ్చారు. చేతిలో ఏవో చిన్న చిన్న కాగితం సంచులు, లెదర్ పర్సు, ఇంకా ఏమిటేమిటో చాలా సరంజామా తెచ్చారు.

"చెప్పుకో ఇదేమిటో!" అన్నారు వస్తూనే.

నాకేం అర్థం కాలేదు. సిగరెట్లు మాత్రం కావు. నాకు తెలీలేదన్నాను.

లెదర్ సంచిలోంచి పైప్ తీశారు. మరో చిన్న సంచిలోంచి ఏదో పదార్థంలాంటిది తీశారు. కుంపట్లో బొగ్గులు వేసినట్లు ఆ పదార్థం తుంపులుగా చేసి పైపుతొర్రలో తురిమారు. అగ్గిపెట్టె తీశారు. రెండు డజన్ల అగ్గిపుల్లలు అంటించి కుంపటి వెలిగించినట్లు ఆ పైపు వెలిగించారు. పైపు నోట్లో పెట్టుకుని స్టైల్‌గా ఒకసారి పీల్చి పొగ గుప్పున వదిలి మళ్లీ పీల్చబోయారు. అప్పటికే అది ఆరి పోయింది, వానాకాలంలో తడిసిన కట్టెల పొయ్యి లాగా. అగ్గిపెట్టె ఖాళీ అయింది, రెండు గుక్కలు పీల్చి వదిలేసరికి. ఆ పొగాకు వాసనకు కడుపులో కాస్త వికారంగా ఉన్నట్లనిపించింది.

"పైగా ఇదేమిటి! సిగరెట్ మానేశారని సంతోషిస్తూంటే మళ్లీ ఈ పొగాకు పీడా ఎక్కణ్ణుంచి వచ్చింది!" అంటూ విసుక్కున్నాను.

"చూడూ! ఇది నీకు పొగాకు అనిపించచ్చు. కాని ఇది దొరలు ఉపయోగించే పొగాకు; నాటు రకం గాదు. సిగరెట్ అందరూ తాగుతారు. కాని ఈ పైప్ ఉందే? చాలా గొప్పవాళ్ళే తాగుతారు. దీనికంతా ఉందిలే విషయం" అంటూ రెండో అగ్గిపెట్టె తీశారు.

"ఇదొక్కటే దీనితో కష్టం. అగ్గిపెట్టెలకు పెట్టెలే అయిపోతాయి ఒక రోజుకు" అంటూ మావారు ఆరిపోయిన పొయ్యి కుళ్లగించి చిన్న చిన్న చిదుగులు వేసి అంటించినట్లు, పైపులో సగం కాలి దమ్ముకున్న పొగాకు తుంపుల్ని ఒక పుల్లతో కుళ్లగించి, మళ్లీ కాస్తంత పొగాకు తురిమి వెలిగించారు. ఆరు అగ్గిపుల్లలకు వెలిగింది. ఒకసారి దర్జాగా పీల్చి వదిలి దాని సుగుణాన్ని గురించీ, గొప్పతనాన్ని గురించీ వర్ణించి చెప్పి మళ్లీ పీల్చ బోయారు. ఏముంది! పొయ్యి ఆరిపోయినట్లు ఆరిపోయి కూర్చుంది. మళ్లీ వెలిగించడానికి ప్రయత్నం మొదలెట్టారు. వారి ఓపిక్కి నాకు విసుగూ, చిరాకూ కలిగాయి. చిన్న పిల్లాడిలా అరగంటనుంచీ ఆ పైపుతో తంటాలు పడుతూండడం చూస్తే నవ్వొచ్చింది.

ఎవరిచ్చారని అడిగితే చెప్పారు. సిగరెట్ మానేశాక చాలా డల్‌గా ఉన్నారని ఎవరో స్నేహితుడు ప్రజంట్ చేశాట్ట.

"వద్దనకపోయారా?" అన్నాను.

"అబ్బే, ఎందుకూ! ఇది హార్మ్‌లెస్! గుప్పు గుప్పుమని పొగ బయటికి వదలచ్చు. లోపలికి పీలిస్తేనేగదా డేంజర్? దీని కాభయం లేదు. ఇది దొరల పద్ధతి" అంటూ నాకు నచ్చజెప్పారు.

నాకేమో ఆయోమయం అనిపించిందా పైపు చూసి.

పొద్దుటే లేచింది మొదలు అంట్ల పాత్రను కడిగినట్లు ఆ పైపును కడిగి తుడిచి పైపు లోపలంతా శుభ్రంచేసి పొగాకు తుంపులు చేసి తురిమి అగ్గిపెట్టె సగం అయ్యాక అది వెలిగించడం. ఒకసారి పీల్చగానే దమ్ముకోవడం. మళ్లీ మొదలు.

మావారు పొద్దస్తమానం ఆ పైపుతో అవస్థపడుతూ మిగతా పన్లన్నీ వదిలేశారని అంతా ఎగతాళి చేసి గోల చేయడం మొదలెట్టారు.

పైపు పీల్చడంవల్ల దవడలు నొప్పులంటూ దవడలు నొక్కుకోవడం మొదలెట్టారు. పొగాకు పొగకు పళ్ళన్నీ ఎర్రబడ్డాయి. నాలుక పుండయింది. పొగాకు సంచులు, పైపు, పర్సు వగైరా సరంజామా అంతా పాంటు జేబులో పట్టవు గనక ఒక కుర్రాణ్ణి పెట్టారు, ఆ పైపుసామాన్లు వారితో కూడా ఉండి మోసుకు తిరిగేందుకు.

చేతులో పైపు సామాన్లతో ఆ కుర్రాణ్ణి చూడగానే అంతా నవ్వడం మొదలెట్టారు— "పిల్లాబోయి డోలా వచ్చే డమ్ డమ్" అంటూ.

సిగరెట్ మానేసిన వారంరోజులూ బుర్ర పనిచేయలేదనీ, డల్‌గా ఉందనీ అంటూ వచ్చారు. పైపు తాగడం ఆరంభించినప్పట్నుంచీ బుర్రంతా దానికోసమే పనిచేస్తూంది; టైమంతా దాని



తోనే సరిపోతూంది అంటూ సణుగుడు మొదలెట్టారు.

"పోనీ, ఎందుకీ గొడవంతా? ఆ సిగరెట్టే తాగితే పోలా!" అని నేనంటే టపీమని ఒక మోపు సిగరెట్లు తెప్పించి కాల్చేయాలని కాచుకో నున్నారనీ నాకు తెలుసు. నే నెందుకంటాను? తనంతట తను చెప్పడానికి ఆత్మాభిమానం అడ్డుపడి నానా అవస్థ పడుతున్నారు!

పైపు వచ్చి మూడురోజులైంది. మొదట రెండురోజులూ దానియందు చూపిన శ్రద్ధ కాస్త సన్నగిలింది. దాన్ని క్లీన్‌చేసే ఓపికలేక అవతలపడేస్తూ వచ్చారు. మళ్లీ తాగాలని గాలి మళ్లినప్పుడు కాస్త శుభ్రంచేసి దానితో అవస్థపడి కాసేపు దవడలు నొప్పెట్టాక మళ్ళీ అవతల పడేసెయ్యడం మొదలెట్టారు. మరి దొరల పద్ధతి ఈలాగే ఉంటుందా అంటూ నేను అడగాలనుకుని అసలే చిరాగ్గా ఉన్న మనిషిని ఎందుకు మరి కాస్త ఇబ్బంది పెట్టడం అని గొడవంతా చూసీచూడనట్లు ఊరుకున్నాను.

మావారి స్నేహితుడి 'వెడ్డింగ్ యానివర్సరీ' అంటూ వాళ్లింటికి డిన్నరుకు పిలిచారు మా ఇద్దర్నీ. మావారికి పైపు బాధతో బుర్రంతా చెడిపోయింది. దాన్ని అంటించడానికి పడే అవస్థకు

(తరువాయి 38 వ పేజీలో)



# ఎందుకు లెండి!

( 35 వ పేజీతరువాయి)

తనమీద తనకే కోపం వస్తూంది. ఊరికేనా ఉండలేకపోతున్నారు. సిగరెట్‌లాంటిదేదో ఒకటి తాగుతున్నాననే తృప్తికోసం లేని ఓపిక తెచ్చుకుని ఆ పైపుతో సతమతమయ్యేవారు.

"స్నేహితుడింటికి డిన్నర్‌కు వెళ్లేప్పుడు పైపు తీసుకెళ్తారా?" అన్నాను నవ్వుతూ.

"ఛా ఛా! వెధవ పైపు! దానితో అరగంట అవస్థపడితేగాని వెలగదు. వెలిగినా ఒక్క గుక్క పీల్చేసరికి ఆరిపోతుంది. దానితో ఎవడు పడతాడు. అవస్థ! అక్కడ వాళ్లంతా ఎగతాళి చేయ డానికా!"

"మరి దొరలంతా ఏంచేస్తారు?" అన్నాను.

"ఆఁ! వాళ్లా ఈ లాగే అవస్థ పడతార్లా ఉంది! ఏదో ముసలాళ్లు పడచ్చు పనీ పాటా లేకుండా పొద్దస్తమానం కూర్చుని. పనిచేసే వాళ్లకి లాభంలేదు" అంటూ మావారు తేల్చేశారు. 'అబ్బ! ఈ పొగాకు పీడా వదిలిపోతుంది గదా' అని మనసులో సంతోషించాను.

ఆ రాత్రి డిన్నరుకెళ్ళాం. అక్కడవాళ్లంతా "ఏం బ్రదర్! సిగరెట్ మానేశావటగా? కంగ్రాచులేషన్స్" అంటూ మావార్ని అభినందించడం మొదలెట్టారు.

ఏదో పోగొట్టుకున్న ఎక్స్‌ప్రెషన్ మావారి ముఖంలో కనిపించింది. నవ్వుతున్నారే గాని ఆ నవ్వులో లైఫ్ లేదు. యాంత్రికంగా అందరితో మాట్లాడుతున్నారేగాని వారి దృష్టంతా సిగరెట్లు కాల్చేవాళ్లమీదే ఉందని గ్రహించాను.

"ఏం బ్రదర్, ఈమధ్య సిగరెట్ మానేసి పైపు స్మోక్ చేస్తున్నావటగా? అది న్యూసెన్స్, బ్రదర్!" అన్నారెవరో.

"అవును, బ్రదర్! చాలా న్యూసెన్స్. నా కే పనీ పొగలేదు. పైగా దవడలు నొప్పులు" అంటూ చెంపలు రాచుకున్నారు మావారు. అంతా గొల్లున నవ్వారు.

"ఎందుకు, బ్రదర్! కొత్తగా వచ్చాయి ఫిల్టర్డ్ సిగరెట్లు. అవి కాలిస్తే ఏం డేంజర్ లేదు. మామూలు సిగరెట్లకూ, వాటికీ చాలా వ్యత్యాసం ఉంది. అసలిది సిగరెట్టే అనుకో అక్కర్లా! అంత మంచి క్వాలిటీ. ట్రైచేసి చూడూ" అంటూ ఆఫర్ చేశా డో ఫ్రెండ్.

సిగరెట్ చూడగానే మావారి కండ్లు మిలమిల మెరిశాయి. తీసుకోవాలని చెయ్యి చాస్తూ నా వైపు చూశారు.

ఏం జరగబోతుందో అప్పటికే ఊహించిన నేను మరోవైపు తిరిగాను చూడనట్టు. ఒక్క క్షణం తటపటాయించి సిగరెట్ తీసుకున్నారు. ఫ్రెండ్ వెలిగించాడు.

పదిరోజుల తర్వాత మళ్లీ మావారి చేతిలో సిగరెట్ కనిపించింది. పెట్టెలకు పెట్టెలే కాల్చే మావారు ఆ ఒక్క సిగరెట్‌తో ఆగుతారని నమ్మకం ఏముంది! దేముడిమీద భారం వేశాను.

మర్నాడు ఫిల్టర్డ్ సిగరెట్ల పెట్టె పట్టుకొచ్చారు మావారు, ఎక్కడలేని ఉత్సాహంతో.

"ఇదేమిటీ!.....మళ్లీ" అన్నాను.

"అబ్బే! ఇవి ఫిల్టర్ చేసినవి. ఈ పొగ లోపలికెళ్లదు. వెళ్లినా దోషంలేదు. ఇది అసలు సిగరెట్ కానేకాదు. కాగితాల చుట్ట అనచ్చు" అంటూ సిగరెట్ అంటించారు.

"ఎందుకయినా మంచిది, కొద్దిగా కాల్చండి" అన్నాను చేసేదేంలేక.

"అబ్బే! ఇవి అసలు ఎక్కువ కావాలన్నా దొరకవులే!" అన్నారు.

"అదేమిటీ! మీవారు సిగరెట్ మానేశారన్నావ్! మళ్లీ కాలుస్తున్నారే?" అన్నారు కొందరు నా స్నేహితురాండ్లు.

"అబ్బే! అవి ఫిల్టర్డ్‌వి. సిగరెట్లు కావు. వాటివల్ల ఏ అపకారం లేదన్నారు" అంటూ మావారిని సమర్థించబోయాను.

"భేష్, భేష్! నీ బుర్ర కూడా కాస్త ఫిల్టర్డే. నాలుగురోజులు మానేసిన మావారూ ఈలాగే చెప్పి మర్నాట్నుంచీ మామూలు సిగరెట్లు మొదలెట్టారు. పైగా ఇంకొక కిటుకు ఉంది ఇందులో. పెట్టెమాత్రం ఫిల్టర్డ్‌దే తెస్తారు. లోపల సిగరెట్లు ఫిల్టర్డ్‌వా లేక మామూలువా అని చూడు. ఈ విషయంలో నీ కళ్లకి ఫిల్టర్ వేస్తారు. జాగ్రత!" అంటూ హెచ్చరించారు.

"మావారు అంత మోసం చేస్తారనుకోను" అన్నాను, లోపల సందేహం పీడిస్తున్నా.

"అందరివార్లూ ఈ విషయంలో మోసం చేసి తీరతారనుకో, మందమతీ!" అంటూ నా చెవులు మెలేశారు.

మావారెప్పుడింటి కొస్తారా, ఎప్పు డా సిగరెట్‌పెట్టె చూద్దామా అని ఎదురు చూస్తూ కూర్చున్నాను.

వచ్చారు. ఒక పెట్టెకాదు, డజన్ పెట్టెలు తెచ్చారు.

"ఏమిటలా చూస్తున్నావ్! మళ్లీ దొరకవని తెచ్చాను" అంటూ పెట్టెలన్నీ టేబిల్ డ్రాయర్లో పడేస్తూంటే గబగబ వెళ్లి పెట్టెలన్నీ బయటికి తీసిచూశాను.

ఏముంది! నా స్నేహితురాండ్లు చెప్పింది అక్షరాలా నిజం. పెట్టెలు ఫిల్టర్డ్‌వే! లోపల సిగరెట్లన్నీ మామూలువే ఉన్నాయి. మావార్ని చూశాను.

ఎందుకులెండి! ★

ఖజురహో శిల్పం

ఫోటో—సునీల్ భారతి (న్యూఢిల్లీ-14)